# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### అభివృద్ధి పనుల శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి



బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం

బోనకల్లు, అక్టోబర్ 27 : ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బోనకల్లు మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.3.95 కోట్లతో తూటికుంట్ల – గోవిందాపురం (ఎల్) మధ్య , రూ.2.45 కోట్లతో బ్రాహ్మణపల్లి – రాపల్లె మధ్య, రూ.1.50 కోట్లతో కలకోట – నారాయణపురం మధ్య, రూ.3.50 కోట్లతో చిరునోముల – డబ్బాకపల్లి మధ్య చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం కలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ సంక్షేమ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. కలకోట పెద్దచెరువు వద్ద మత్స్య సొసైటీ సభ్యులకు రాయితీ చేప పిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు గుడికందుల జ్యోతి, జీ.గణేశ్, నాగేంద్రరెడ్డి, జ్ఞానేశ్వర్, సురేందర్, విజయచందర్, రామ్మూర్తి, అనిశెట్టి పున్నంచందర్, ఆర్.రమాదేవి, వెంకటశాస్త్రి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# డేంజర్ రోడ్లు



జాతీయ రహదారి పక్కన హెచ్చరిక బోర్డును కమ్మేసిన చెట్లు



దమ్మపేట-పాల్వంచ రహదారిపై పెద్ద గుంత

దమ్మపేట రూరల్, అక్టోబర్ 27: మండలంలోని జలవాగు, బొగ్గంరాజుల గుంపు తదితర రహదారులు 'డేంజర్ రోడ్లు'గా, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. ''కొత్త రోడ్ల నిర్మాణం మర్చిపోవాల్సిందే. ఎందుకంటే, ఉన్న రోడ్లపై గుంతలను పూడ్చడానికి, మరమ్మతులు చేయడానికే నిధుల్లేవు'' అని, సంబంధిత అధికారి ఒకరు అసలు విషయం బయటపెట్టారు. మందలపల్లి–అశ్వారావుపేట జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును దట్టంగా పెరిగిన చెట్ల కొమ్ములు కప్పేశాయి. దీంతో ఆ బోర్డు కనిపించడం లేదు. 'కనీసంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు కూడా నిధులు లేవా..?' అనే ప్రశ్న తలెత్తుతున్నది. మండలంలోని జలవాగు, బొగ్గంరాజుల గుంపు తదితర రోడ్లు గుంతలమయంగా, వీటిపై వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఈ డేంజర్ రోడ్లపై వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# కాలువలో కాలుష్య జలాలు



కాలువలో ప్రవహిస్తున్న కాలుష్య జలం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 27: పచ్చని చెట్ల మధ్య అందమైన రంగులతో నెమ్మదిగా ప్రవహించే ఈ నీటిని చూసి ఇదేదో విదేశాల్లోని దృశ్యమని అనుకుంటున్నారా? అయితే మీరు పొరపడినట్లే. పాల్వంచ మండలం సూరారానికి వెళ్లే దారిలోని బూడిదవాగు ఫొటో ఇది. సూరారానికి సమీపంలో ఒక కర్మాగారం ఉంది. అందులోంచి వెలువడే బూడిదతో కలిసిన నీరు ఈ కాలువలోంచి సూరారం, సోములగూడెం మీదుగా కిన్నెరసాని వాగులో కలుస్తుంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ ఇటీవల కొద్ది రోజుల నుంచి బూడిద నీరు రంగు మారుతోంది. ముదురు గోధుమరంగులో నురగలతో నీరు కాలువలో ప్రవహిస్తోంది. సమీప కర్మాగారంలోని బూడిదతోపాటు ఇతర కాలుష్య కారకాలను ఈ కాలువలోకి వదలడం వల్ల నీరు రంగు మారి నురగలతో కనిపిస్తోంది. ఈ వాగు పరీవాహక ప్రాంతంలో అనేక గ్రామాలు ఉన్నాయి. వాటిల్లోని పశువులు ఈ నీటిని తాగుతుంటాయి. గతంలో కూడా కొన్నిసార్లు ఇదే విధంగా కలుషిత నీరు తాగి పశువులు జబ్బుల బారిన పడ్డాయని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం కూడా ఈ నీటిని తాగి అవి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నమండవలో ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే పూజలు



చిన్నమండవ నాయకులతో ఎమ్మెల్యే తాతయ్య

చింతకాని, అక్టోబర్ 27: మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో స్వయంభువుగా వెలసిన నామాల వేంకటేశ్వర స్వామికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఓ భక్తుని మొక్కు చెల్లింపు కోసం గ్రామానికి చేరుకున్న ఆయన మొదటగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాసరావు, రాము, గోపీ, తిరపతిరావు, శ్రీకాంత్, భాస్కర్‌రావు, నాగుల్‌మీరా, వంశీ, వెంకటరాములు పాల్గొన్నారు.

## ఎదురు కాల్పుల్లో గాయపడిన మావోయిస్టు

### అదుపులోకి తీసుకుని చికిత్స అందిస్తున్న పోలీసులు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 27: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతాదళాలు, మావోయిస్టులకు మధ్య ఆదివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు గాయాలతో పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమ్మమెట్టా అడవుల్లో మట్వాడ ఏవోఎస్ కమాండర్ అనిల్ పూనెంతో పాటు మరో 12 మంది సాయుధ మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ బలగాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన డీఆర్‌జీ బలగాలు ఎదురు కాల్పులు జరిపారు. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుకుంటూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు గాలింపులు చేపడుతుండగా ఎదురు కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఆర్‌పీసీ సభ్యుడు రాకేష్‌కుమార్ ఓయమ్ పట్టుబడ్డాడు. గాయపడిన మావోయిస్టుకి బీజాపూర్ జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స నిమిత్తం జగ్దల్‌పూర్ హెడ్‌క్వార్టర్స్‌కి తరలించారు. రాకేష్‌పై గతంలో అనేక నక్సల్స్ సంబంధిత నేరాల్లో జంగ్లా, భైరామ్‌గఢ్, మిర్తూర్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మరి కొందరు గాయపడినట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అప్పారావుకు పరామర్శ



అప్పారావును పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, అక్టోబర్ 27: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యన్నంశెట్టి అప్పారావును ఆదివారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు పరామర్శించారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మధిర పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, ముత్తవరపు ప్యారీ, జేవీ.రెడ్డి, పరిశ శ్రీనివాసరావు, మేస్త్రీకొండ, రాంబాబు తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు రాంబాబు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి యూటీఎఫ్ బలపరిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా, మండల అధ్యక్షులు కిశోర్ సింగ్, రాంబాబు కోరారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాంబాబు అధ్యతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలాల్లోని ఉన్నత పాఠశాలల వివరాలు తెలుసుకుని ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలు సేకరించడం జరిగిందన్నారు. టీ జాన్, పీ జయరాజు, అన్నపూర్ణ, కృష్ణవేణి, ఎల్ రూప్‌సింగ్ పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణానికి మోక్షం

వైరాటౌన్, అక్టోబర్ 27: వైరా కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో ఉన్న రోడ్డు స్థానిక స్నానాల లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే లింకు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత సంవత్సరం ఫిబ్రవరిలో రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ స్థల యజమాని బాలకృష్ణ అడ్డుకోవడంతో నిర్మాణం ఆగిపోయింది. కొంతకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సంప్రదించగా రహదారి ఇవ్వడానికి దిలీప్ హాస్పిటల్ యాజమాన్యం బాలకృష్ణ అంగీకరించడంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిశీలించి నిర్మాణాన్ని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు మనోహర్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మనోహర్

మధిర, అక్టోబర్ 27: మున్సిపాలిటీలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థి మాగంటి మనోహర్ కొత్తగూడెంలో జరిగిన కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్–17 జట్టుకు ఎంపికయ్యాడు. మండల, జోనల్, జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆదివారం జరిగిన ఎంపికలో రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట నరసింహారావు తెలిపారు. ఎంఈవో వై.ప్రభాకర్, పీడీ ఎం.మాధవరావు, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరాచారి, బూసా కోటేశ్వరరావు, కంచిపోగు ఆదాం, పీ.కిశోర్, ఎస్.శైలజ, టీ.జ్యోతిర్మయి, బీవీబీఎన్ ఎం.శర్మ, ఎస్.సంధ్యాలక్ష్మి, ఎస్.శ్రీదేవి, జీ.రామచంద్రరావు, ఎం.సామేలు, ఎ.కృష్ణమూర్తి, సీ.హెచ్.చిట్టిబాబు, మనోహర్, తల్లిదండ్రులు ముత్యాలు, విజయ, ఏఎపీసీ చైర్మన్ వేమిరెడ్డి నాగలక్ష్మి, స్థానిక క్రీడాకారులు గోపి, కిరణ్, హరీష్, గ్రామపెద్దలు అభినందించారు.

# పండక్కి బంగారం కొంటారా

## గోల్డ్ హాల్‌మార్కింగ్ అంటే ఏమిటి? ఎందుకిది ప్రధానం.. చార్జీలెంత!




**దీపావళి** పండుగ వేళ చాలామంది బంగారం కొంటూంటారు. ఇంకా చెప్పాలంటే మన దేశంలో ఇదో సంప్రదాయం.. అంతకుమించి ఓ సెంటిమెంట్. అవును.. ఈ పండక్కి పుత్తడి కొంటే లక్ష్మీ కటాక్షం దక్కినట్టేనని ఎంతోమంది నమ్మకం మరి. అయితే ఒకప్పటితో పోల్చితే ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల మోసాలు జరుగుతున్నాయి. అమాయక కొనుగోలుదారులకు తక్కువ క్యారెట్ బంగారం అప్పజెప్పి ఎక్కువ సొమ్ము దండుకుంటున్న సంఘటనల్ని చూస్తూనే ఉన్నాం. అందుకే బంగారం నాణ్యతను తెలియజేసే ఎన్నో ప్రమాణాలను తీసుకొచ్చారు. అందులో ప్రధానమైనదే గోల్డ్ హాల్‌మార్కింగ్.

ంగతి..

కొనుగోలుదారుల్లో నమ్మకాన్ని కు బ్యూరో ఆఫ్ ఇండియన్ (బీఐఎస్) పరిచయం చేసినదే ఈ ల్‌మార్కింగ్ ప్రక్రియ. నగలు, కడ్డీలు ఇతరత్రా బంగారు ఉత్ప ్యతను తెలియపర్చడంలో ఇది ానం. దీని ప్రకారం ప్రతీ నగపై ార్క్, బంగారం నాణ్యతను తెలి 2 క్యారెట్ 916 ప్రమాణం, 6 జిటల్ హాల్‌మార్కింగ్ యూనిక్ ్‌యూఐడీ)లు ఉంటాయి. ఒక ఆభరణం మీద ఉన్న ఐడీ మరొక ఆభరణం మీద ఉండదు. సులభంగా ఆ ఐడీతో అన్ని వివరాలు తెలుస్తాయి. ఈ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం నగల అమ్మకందారులందరికీ తప్పనిసరి చేసింది.


### బీఐఎస్ హాల్‌మార్క్

ఇది మీరు కొనే బంగారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ద్వారా నిర్వహించే లైసెన్స్‌డ్ లాబొరేటరీలో పరిశీలించబడినది అన్న దాన్ని సూచిస్తుంది. అలాగే ఇవి తాము అమ్మిన బంగారు ఆభరణాలని సూచించేలా కొందరు జ్యుయెల్లర్స్ తమ సొంత యూనిక్ ఐడెంటిఫికేషన్ మార్క్‌లనూ నగలపై వేస్తున్నారు. సాధారణంగా వారి బ్రాండ్లు, దుకాణాల పేర్లతో ఇవి ముడిపడి ఉంటున్నాయి.



### ప్యూరిటీ

బంగారం నాణ్యతను క్యారెట్లలో కొలుస్తారు. 24 క్యారెట్ (99.9%) అంటే పూర్తిగా స్వచ్ఛమైన బంగారమే. మార్కెట్‌లో ఇది బిస్కట్లు, కడ్డీలు, నాణేల రూపంలో లభిస్తుంది. 22 క్యారెట్ (22K916) అంటే అందులో 91.6 శాతం నాణ్యమైన బంగారం ఉంటుందన్న మాట. మనం కొనే ఆభరణాలు ఈ నాణ్యతతోనే ఉంటాయి. అచ్చంగా పసిడితోనే నగలు తయారుకావు. అందుకే రాగి, ఇతరత్రా లోహాలను కలపాల్సి ఉంటుంది. దానివల్ల నాణ్యత కొంత తగ్గుతుంది. ఇక 18 క్యారెట్ (18K750) అంటే ఇందులో బంగారం 75 శాతం మాత్రమే ఉంటుంది. మిగతా 25 శాతం ఇతర లోహాలుంటాయి. 14 క్యారెట్ (14K585)లో బంగారం పరిమాణం 58.5 శాతమే. క్యారెట్ ప్రామాణికత తగ్గిన కొద్దీ ధరలూ తగ్గుతూంటాయి. అందుకే అత్యధిక ధరను పెట్టి కొనే నగలపై 22K916 ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.






### చార్జీలు ఇలా..

మన దగ్గరుండే పాత బంగారు ఆభరణాలకూ హాల్‌మార్కింగ్ చేయించుకోవచ్చు. బీఐఎస్ నమోదిత జ్యుయెల్లర్స్ వద్దకు వెళ్లి వారి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. లేదా బీఐఎస్ గుర్తించిన అస్సేయింగ్ అండ్ హాల్‌మార్కింగ్ సెంటర్ల (ఏహెచ్‌సీ)కు వెళ్లి అక్కడ ఈ పనిని చేసుకోవచ్చు. మీ నగల నాణ్యతను పరిశీలించిన తర్వాతే హాల్‌మార్కింగ్ జరుగుతుంది. చార్జీలు ఒక్కో బంగారు ఆభరణానికి రూ.45గా తీసుకుంటారు. వెండి వస్తువులకూ ఉంటుంది. అందుకు రూ.35 తీసుకుంటారు. కన్‌సైన్‌మెంట్ కోసమైతే కనీస చార్జీ బంగారానికి రూ.200, వెండికి రూ.150గా ఉంటుంది. వీటికి సర్వీస్ ట్యాక్స్, ఇతర చార్జీలు అదనం. బరువుతో సంబంధం లేకుండా ఈ చార్జీలు పడుతాయి. కొత్తవి షాపుల్లో కొంటున్నప్పుడైతే తయారీ, మజూరీ (మేకింగ్, వేస్టింగ్) చార్జీల్లో ఈ హాల్‌మార్క్ చార్జీలు కలువవు. వీటిని వేరుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక గతంలో నాలుగైదు సంకేతాలతో హాల్‌మార్కింగ్ ఉండేది. అదిప్పుడు మూడుకు తగ్గింది. కాబట్టి పాత హాల్‌మార్కింగ్‌కూ విలువ ఉంటుంది. అందులో హెచ్‌యూఐడీ లేదని ఆందోళన చెందనక్కర్లేదు.

# అమ్మకాల ఒత్తిడిలోనే..

మార్కెట్ పల్స్



**దేశీయ** స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశ, విదేశీ అననుకూలతల మధ్య మదుపరులు పెట్టుబడులకు దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు లేదా 2.24 శాతం పడిపోయి 79,402.29 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 673.25 పాయింట్లు లేదా 2.70 శాతం పతనమై 24,180.80 దగ్గర ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే అధిక అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికానికి (జూలై–సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మునుపటిలాగే మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ముడి చమురు ధరలు ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500–24,700 మధ్యకు వెళ్లవచ్చని చెప్తున్నారు.


*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*

# ఈ రంగాలపై ఓ లుక్కేయండి

### మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకు అవకాశాలున్నవివే

**మ్యూచువల్** ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెట్టాలని మీరు యోచిస్తున్నట్టైతే.. అందుకు ఈ దీపావళియే సరైన సమయమని మెజారిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పైగా కొన్ని రంగాలను పరిశీలించాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. వాటిలో మధ్య–చిన్న శ్రేణి ఐటీ కంపెనీలు, దేశీయ ఫార్మా సంస్థలు, పాత ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, టైర్ల తయారీ సంస్థల స్టాక్స్ అనుకూలంగా ఉన్నట్టు చెప్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పలు దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. దీంతో చిన్నచిన్న మొత్తాల్లో పెట్టుబడులకు దిగాలని కూడా ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. ఇందుకోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ఎంచుకోవడం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. వీక్లీ, మంత్లీ, త్రైమాసిక పద్ధతుల్లో పెట్టుబడులకు వీలుంటుందని, వెయ్యి రూపాయలతో కూడా మదుపును మొదలు పెట్టవచ్చంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సిప్‌ల్లోకి నిధుల వరద మునుపెన్నడూ లేనివిధంగా రూ.24,509 కోట్లుగా ఉండటం గమనార్హం. మొత్తానికి ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షణీయ రాబడులకు ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉన్నందున నిపుణులను సంప్రదించి పెట్టుబడులకు దిగితే ఇంకా లాభించవచ్చు. అంతేగాక స్వల్పకాలిక పెట్టుబడుల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులు కలిసొస్తాయన్న వాదనలూ ఉన్నాయి.







# రాబడి



# చిన్న బ్యాంకు.. పెద్ద వడ్డీ

## స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు అదుర్స్

### సీనియర్ సిటిజన్లకు 9.50% వడ్డీరేటు

**ఫిక్స్‌డ్** డిపాజిట్ (ఎఫ్‌డీ).. రిస్క్‌కు దూరంగా, సురక్షితమైన పెట్టుబడికి చక్కని నిర్వచనం. అయితే ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం రాబడులు తక్కువ. కానీ కొన్ని బ్యాంకుల్లో ఎఫ్‌డీలపైనా ఆకర్షణీయ వడ్డీరేట్లున్నాయి. ఏకంగా 9 శాతానికిపైగానే వడ్డీ లభిస్తుండటం గమనార్హం. అవును.. సీనియర్ సిటిజన్లకు పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో గరిష్ఠంగా 9.50 శాతం వరకు వడ్డీరేటు వస్తున్నది.

- **నార్త్‌ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  546–1,111 రోజుల (18 నెలల ఒక్క రోజు– మూడేండ్ల 16 రోజులు) కాలవ్యవధి ఎఫ్‌డీలపై అత్యధికంగా సీనియర్ సిటిజన్లకు 9.50 శాతం వడ్డీరేటునిస్తున్నది. రూ.5 కోట్లలోపు ఎఫ్‌డీలకే వర్తిస్తుంది. ఈ ఏడాది జూన్ 25 నుంచి ఈ రేటు అమల్లోకి వచ్చింది.
- **సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  రెండేండ్ల నుంచి మూడేండ్లదాకా చేసే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు ఇక్కడ 9.10 శాతం వడ్డీరేటు ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4 నుంచి వర్తిస్తున్నది.
- **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  సీనియర్ సిటిజన్లకు 1,001 రోజుల ఎఫ్‌డీపై 9.50 శాతం వడ్డీరేటు, 701 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేటును ఈ బ్యాంక్ ప్రకటించింది. ఈ నెల 7 నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి.
- **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  1,001 రోజుల ఎఫ్‌డీపై 9.10 శాతం, 1,500 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేట్లను సీనియర్ సిటిజన్ల కోసం ఈ బ్యాంక్ ఇస్తున్నది. ఈ ఏడాది జూన్ 7 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

### అదనపు సౌకర్యాలు

చాలా బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై అదనపు వడ్డీరేట్లను అందిస్తున్నాయి. ఫిక్స్‌డ్ చేసే మొత్తాల ఆధారంగా ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 0.50 శాతం నుంచి 0.75 శాతం మేర ఎక్కువ వడ్డీరేట్లు అమలవుతున్నాయి. అంతేగాక వృద్ధులకుండే సమస్యలు, ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌డీలపై రుణాలనూ బ్యాంకర్లు ఇస్తున్నారు. అయితే చేసే ఎఫ్‌డీలపై ఈ రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. పెద్ద ఎఫ్‌డీలపై అంతే మొత్తాల్లో రుణ సదుపాయం దొరుకుతుంది. ఈఎంఐల్లో ఈ లోన్లను తీర్చుకోవచ్చు. ఇక అత్యవసరాల దృష్ట్యా ఎఫ్‌డీల ముందస్తు ఉపసంహరణలకూ కొన్ని సంస్థలు అనుమతినిస్తున్నాయి. అయితే ఇందుకు స్వల్ప మొత్తాల్లో జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏండ్లు, ఆపై వయసుగలవారు తమ ఎఫ్‌డీలపై పొందే వడ్డీ ఆదాయానికి టీడీఎస్ మినహాయింపు కోసం సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ 15హెచ్‌ను సమర్పిస్తే ప్రయోజనాన్ని అందుకునే అవకాశాలున్నాయి. ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 197ఏ, సబ్‌సెక్షన్ 1సీ ఇందుకు వీలు కల్పిస్తున్నది. వడ్డీరేట్లు, కాలవ్యవధి, ఇతర ప్రయోజనాలు సీనియర్ సిటిజన్లకు అత్యుత్తమ ఎఫ్‌డీ ఏది అనేది నిర్ణయిస్తాయి. కాబట్టి ఎఫ్‌డీని తీసుకొనే ముందు దాని ఫీచర్లను గమనించాలి.

